## కథ

### వై.కె .మూర్తి

# ప్రలోభం

కమల సినిమాహాలు వద్ద రిక్షాదిగి గబగబా లోపలికి వెళ్తోంది.టికెట్స్ అయిపోతాయేమోనని!

ఇంతలో కాలికేదో తగిలింది.వెంటనే కిందకి వంగి ఆ వస్తువు తీసి అరచేతిలోపెట్టుకుని చూసింది. బంగారుగొలుసు.

ఏమిటి? తనకు బంగారు గొలుసు దొరికిందా? అసలు ఇది బంగారమేనా? అనుమానంలేదు.అది బంగారమే. చూసింది.ఎవరి గొడవలో వాళ్ళున్నారు. ఎవరూ తనను గమనించలేదు.గబాల్న ఆగొలుసుని తన పర్సులో పడేసింది. క్యూలోనిలబడిందన్న మాటేగాని మనసంతా ఆగొలుసుమీదేఉంది.తన చేతిలోని పర్సు ఎంతోబరువుగా అనిపించింది. ఎవరిదో పాపం... మూడుకాసులుండవచ్చు. పోగొట్టుకున్నవాళ్ళు చూసుకున్నారో లేదో! ఎంతబాధపడతారో? కొంపదీసి ఈ ఆటకు వచ్చిన వాళ్ళెవరిదైనా కాదుకదా?

ఇలా రకరకాల ఆలోచనలతో సతమతమవుతూ నిలబడింద. టిక్కెట్లు ఇస్తున్నారు.ఎవరైనా గొలుసు గురించి అనుకుంటున్నారేమోనని జాగ్రత్తగా గమనిస్తోంది. అందరూ తమ వరకు టిక్కెట్లు వస్తాయో లేదో నని అనుకుంటున్నారుతప్ప గొలుసు గురించి అనుకోవడం లేదు.

హమ్మయ్య! అయితే ఆగొలుసు పోగొట్టుకున్న వారు ఇక్కడ లేరన్న మాట. అవునుమరి బంగారం దొరకడం అంటే మాటలా? ఎంతో అదృష్టముండాలి. దొరికిన దాన్ని తేలిగ్గా వదులుకోవాలంటే మన సొప్పదంలేదు. కానీ కమలలోనిసంస్కారం 'అదితప్పు' అని హెచ్చరిస్తోంది.పోగొట్టుకున్న వాళ్ళు వస్తేమాత్రం ఇచ్చి వేయడం ఎంత ఉత్తమమో చెప్తోంది. కమల భయపడుతున్న క్షణం రానే వచ్చింది. తనకు నలుగురు ముందున్న ఒకావిడ మెడ తడుముకుని కేక పెట్టింది."బాబోయ్ నాగొలుసు.... గొలుసు.... నాగొలుసుపోయింది." అంటూ ఏడుస్తూ క్యూలోంచి బయటకువచ్చింది. కమల పక్కలో బాంబు పడినట్లయింది. చలనంలేక అలా ఆవిడ వైపు చూస్తుండి పోయింది, ఆవిడ గొలుసుకోసం పిచ్చిదానిలా అటూఇటూ తిరుగుతోంది.

ఇంతలో "ఏమిటి సుశీ ఏమైంది?" అని ఒకావిడ పలకరించింది.

"నాగొలుసు పోయింది" ఏడుస్తూ చెప్పింది.

"వెతుకు... వెతుకు నాకు టిక్కెట్ దొరికింది,నే వెళుతున్నా" అని వెళ్ళిపోయింది. ఆహా.... ఎంత మంచిస్నేహితురాలో ?తనఫ్రెండు గొలుసు పోయిన బాధలో ఉంటే సినిమా మొదలవుతోందంటూ వెళ్ళిపోయింది. అంటే ఆవిడపేరు సుశీల అన్నమాట అనుకుంది కమల.

సుశీలతో ఒకావిడ "ఒకవేళ జాకెట్టులో కాని జారి పడిందేమో చూడండి" అంది.సుశీల జాకెట్టు చూసింది. చీర కుచ్చిళ్ళు దులిపింది,పైటకొంగు జాడించింది. ఊహూ... లేదు, ఎలా ఉంటుంది? అది కమల పర్సులో వుంది.

అయ్యోపాపం ఎన్ని కాసులుంటుందమ్మా?" అని ఒకావిడ. "మీరు ఇంటిదగ్గరనుంచి వచ్చేటప్పుడు మెల్లో పెట్టుకున్నట్లు జ్ఞాపకం వుందా?" అనిమరో ఆవిడ, "బస్సులో వచ్చారా? అక్కడ పోయిందేమో? అని ఇంకొక ఆవిడ ఇలా అక్కడున్న వాళ్ళు ప్రశ్నిస్తున్నారు.

"మూడు కాసులుంటుందండీ... అమ్మా! మీలో ఎవరికైనా దొరికితే ఇచ్చేయండి. మీకెంతో రుణపడి వుంటాను'' అంటూతనముందు అంతమంది వున్నారన్న ధ్యాస లేకుండా గట్టిగా ఏడవడం మొదలు పెట్టింది. అంతా చూస్తున్న కమల మనసులో తీవ్ర ఘర్షణ మొదలైంది. గొలుసు పోగొట్టుకుని దీనంగా ఏడుస్తున్న ఆవిడను చూస్తుంటే ఎంతో జాలి వేసింది. కానీ బంగారం మీద వుండే మమకారం కమలను ఆపని చెయ్యనివ్వలేదు. ఆ.... పోనీలెద్దూ ఆ గొలుసు తనకు దొరికింది. అంతేగానీ తనేం దొంగిలించ లేదు.ఇవ్వాలని ఎక్కడా లేదు. ఇదేం అన్యాయం కాదు. ఇలా ప్రలోభానికి వశమైన కమల మనసు ఆమెలోని సంస్కారాన్ని అణచి వేసింది. టిక్కెట్ తీసుకుని హాలులో కూర్చున్నదన్న మాటేగానీ ఆసినిమాలో ఒక్కముక్కా అర్థం కావడం లేదు. ఏడుస్తున్న ఆవిడ కనబడుతోంది. అయ్యో ఎంతపని చేశాను ? పాపం! ఆవిడ మొహం ఎంత దీనంగా వుందో ? అంతవున్న వాళ్ళు కూడా కానట్టుంది.

ఇంటికెళ్ళాక ఆవిడ భర్త చేత ఎన్ని మాటలు పడవలసి వస్తుందో ? తను వెంటనే 'నాకు దొరికింది గొలుసు' అని ఇచ్చివుంటే తనను అందరూ ఎంత గౌరవంతో చూచివుండేవారు. అంతో ఇంతో చదువుకుని తను ఎందుకు ఇలా అనాగరికంగా ప్రవర్తించింది? సినిమా వదలగానే ఇంటికి వచ్చిన కమల అన్నిపనులూ అన్యమనస్కంగానే చేసింది. భర్త తను భోజనాలు ముగించుకుని పడక గదికి చేరారు.

ఏమిటోయ్! ఎలావుందిసినిమా? అంతలా చూడాలని పోరు పెట్టి వెళ్ళావు కదా. దానిగురించి ఒక్కమాటకూడా మాట్లాడలేదే? ' అన్నాడు భర్త రవి నవ్వుతూ. తను చూసివుంటేగా సినిమా గురించి చెప్పడానికి. "సినిమా బాగానే వుందండీ" అని ఒక్క

నిముషం ఆగి 'ఇవ్వాళ ఒకటి జరిగిందండీ' అంది నెమ్మదిగా కమల. ఏమిటి అన్నట్లు చూశాడు రవి. "మరేమో నాకు సినిమా హాలు వద్ద బంగారు గొలుసు దొరికింది" అంది తలగడ అంచులు చేతితో రాస్తూ. రవి పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు. నిజంగానా కమలా! ఏదిచూపెట్టు" అన్నాడు.

కమల తెచ్చి చూపెట్టింది. రవి దాన్ని అరచేతిలో వుంచుకుని బరువుతూస్తున్నట్లుగా చేతిని కదుపుతూ "పాపం ఎవరిదో! సినిమాకి వచ్చిన వాళ్ళెవరిదో కాదుకదా, ఎవరూ వెతుక్కోలేదా?" అన్నాడు.

మామూలుగా అన్న భర్తమాటలకు ఉలిక్కిపడింది కమల అతన్నిసూటిగా చూడలేక "అబ్బే ఎవరూ వెతుక్కోలేదండీ' అంది తల వంచుకుని..

సరేలే ఏంచేస్తాం. నీకు ఈరోజులక్కుంది, దొరికింది. ఇంత మహాపట్నంలో ఎవరు పారేసుకున్నారో ఎలా తెలుస్తుంది? ఎవరో ఆ దురదృష్టవంతురాలు?" అని ఆ గొలుసు కమలకిచ్చి తను పక్క మీద వాలాడు. కమల ఆ గొలుసును పెట్టెలో అడుగున పెట్టింది. నాలుగైదు రోజులు గిల్టీగా ఫీలయింది. ఎప్పుడైనా పెట్టె తీసినప్పుడు చేతికి తగిల్తే మళ్ళీ ఒకసారి పశ్చాత్తాపంతో దహించుకుపోయేది. కాలచక్రంలో సంవత్సరం తిరిగిపోయింది.

రవి కమల ఏదో ఊరు ప్రయాణం కోసం రైలు ఎక్కారు. తమ బెర్తులు వెతుక్కుని పడకేశారు. ఆ కంపార్ట్‌మెంట్‌లోనే మరో భార్యాభర్తలు వీళ్ళ బెర్తులపక్కనే పడుకునివున్నారు. శీతాకాలం అవడం వల్ల తెల్లారిఅయిదైనా బాగాచీకటిగావుంది. రవి, కమల దిగవలసిన ఊరు వచ్చేసింది. అక్కడ ఆరైలు ఒక్కనిమిషం మాత్రమే ఆగుతుంది. అంచేత ఇద్దరూ హడావుడిగాపెట్టె, బెడ్డింగ్‌మాత్రమే తీసుకుని దిగిపోయారు. మరో సూట్‌కేస్ మరచిపోయి బాగా తెల్లారింది. అందరూ దిగిపోయారు. సుశీల, శేఖర్ మిగిలారు. వాళ్ళు కూడా లేచి తమ సామాన్లు సర్దుకుంటూ వుండగా ఓ సూట్‌కేసు కనపడింది.

అరె! పాపం ఎవరో సూట్‌కేస్ మరచి హడావుడిగా దిగిపోయి నట్టున్నారు" అంటూ సుశీల ఆ సూటుకేస్‌ని అందుకుంది. భర్త శేఖర్‌కిచ్చి అందులో అడ్రస్ దొరుకుతుందేమో చూడండి. వాళ్ళకి అందజేద్దాం అంది.

సరే ఇంటికి పోయి ఆ పని చేద్దాం" అని ఇద్దరూ దిగిపోయారు. ఇంటికి వెళ్ళగానే ఆ సూట్‌కేస్‌లో ఏముందో అని తెరిచి చూశారు.

అందులో మూడొందల క్యాష్ , మూడు పేటల బంగారు గొలుసు, చిన్నడైరీ, టాయిలెట్ సామానులు వున్నాయి."

సుశీ! సంవత్సరం క్రితం నువ్వుపోగొట్టుకున్న గొలుసు గురించి ఎంతో బాధపడ్డావు కదా, ఏదేవుడో నీబాధ చూడలేక వడ్డీతో సహా ఇంకో గొలుసు దొరికేలా చేశాడు" అన్నాడు తమాషాగా నవ్వుతూ భర్తశేఖర్. సుశీల కొద్ది క్షణాలు ఆవస్తువుకేసి చూస్తూ కూర్చుండిపోయింది. తరువాత ఒక నిశ్చయానికి వచ్చినట్లుగా తల పంకించి "ఏమండీ ఆ డైరీ చూడండి వాళ్ళ అడ్రస్ ఉందేమో? అంది. ఆ డైరీలో అడ్రస్ వుంది. అది వీళ్ళు ఇంతకుముందు వున్నఊరే.

ఏమండీ నేను ఒకమాట చెప్తాను వింటారా? మీరు అన్నట్లుగా ఆ దేవుడే వచ్చి ఈ గొలుసు ఇచ్చినా నాకు వద్దండీ. ఒక వస్తువు పోగొట్టుకున్నబాధ స్వయంగా అనుభవించిన నాకు తెలుసు, ఆక్షోభ భరించడం చాలా కష్టమండీ" ఆవిడ ఎంతబాధ పడుతుందో మీరెలాగూ ఆఫీసు పనిమీద ఆవూరు వెళుతున్నారుకదా, అడ్రస్ ఎలాగూ వుంది. వాళ్ళ సొమ్ము వాళ్ళకిచ్చేయండీ" అంది సుశీల. భార్యవైపు మెచ్చుకోలుగా చూశాడు శేఖర్. అలాగే సుశీ నీ ఇష్టం, అయాచితంగా వచ్చిన సొమ్ము నిలవదు" అన్నాడు

అడ్రస్ ప్రకారం ఇల్లు తేలిగ్గానే కనుక్కోగలిగాడు. తలుపు తట్టాడు శేఖర్. మీరేనా రవి గారంటే?" అవునండీ, రండి కూర్చోండి.

రవి కూర్చున్నాడు, తను తెచ్చిన సూట్‌కేసు చూపిస్తూ" ఇది మీదే కదూ?"

అవునండీ మాదే" అన్నాడు తడబడుతూ. "కమలా" ఒక్క కేక పెట్టాడు. భర్త కేక విని కంగారుగా వచ్చింది. అక్కడున్న కొత్త వ్యక్తినిచూసి ఆశ్చర్యంతో నిలబడిపోయింది.

కమలా చూశావా మనం రైలులో మర్చిపోయిన మన సూట్‌కేస్ వీరికి దొరికిందట, మంచి మనసుతో తెచ్చినారు" అన్నాడు రవి ఆయన్ని పరిచయంచేస్తూ.

పెన్నిధి దొరికినంత ఆనందంగా సూట్‌కేస్‌ను చేతిలోకి తీసుకుని తడిమి చూసుకుంది. ఆత్రంగా తెరవబోయింది కమల.

"ఒక్కక్షణం ఆగండి'అన్నాడు శేఖర్. కమలచేయి ఆగిపోయింది. భార్యాభర్తలిద్దరూ శేఖర్‌వైపు చూశారు.

"మీరు నన్ను అపార్థం చేసుకోకండి, దానిలో ఏవేమి వస్తువులు వున్నాయో చెప్పగలరా? జస్ట్ నా తృప్తి కోసం' అన్నాడు శేఖర్.

ఒక్కటీ మర్చిపోకుండా చెప్పేశారు ఉభయులూ.

శేఖర్‌తృప్తిచెందాడు. వస్తువులు అన్నీ సరిగ్గా వున్నాయి.

మీకు మా కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలియడం లేదు. ఈ గొలుసు వుంది చూశారూ, ఇది మా స్వంతం కాదు, పెళ్ళికని అరువు తెచ్చుకుంది నా భార్య. అదిపోయిందని తెలిసినప్పుడు మా పరిస్థితి ఎలావుంటుందో ఊహించండి. వారం రోజులనుంచి నిద్రాహారాలు లేవు. మమ్మల్ని ఓ పెద్ద గండం నుంచి కాపాడి మా పరువు నిలిపారు. నిజంగా మీ రుణం తీర్చుకోలేనిది" అంటూ శేఖర్ రెండు చేతులూ పట్టుకుని ఆప్యాయంగా నొక్కాడు రవి. "నిజానికి మీరు కృతజ్ఞతలు చెప్పవలసింది నాకుకాదు నాభార్య సుశీలకి. ఏడాది క్రితం మేము ఈ ఊళ్ళోనే వుండేవాళ్ళం, ఒకరోజు నాభార్య సినిమాకెళ్ళి గొలుసు పోగొట్టుకుంది. దానిగురించి చాలా బాధపడింది. ఒకరోజు నా భార్య సినిమా కెళ్ళి గొలుసు పొగొట్టుకుంది. దాని గురించి చాలా బాధపడింది. ఒకనెల రోజులు ఆదిగులునుండి తేరుకోలేక పోయింది. అందుకే అప్పుడు తనుపడ్డ బాధగుర్తు తెచ్చుకుని ఇంకొకరు అలా క్షోభ పడకూడదని నన్నుపంపింది జాగ్రత్తగా ఇచ్చిరమ్మని. సూట్‌కేస్‌లోని డైరీలో మీ అడ్రస్ వుండడం మీ అదృష్టం. ఇప్పుడు నేను కూడా ఎంతో తృప్తి గా ఫీలవుతున్నాను మీ ఇద్దరి సంతోషంచూసి" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

మాటల సందర్భంలో ఆ సినిమా హాలు పేరు, సుశీల పేరు విని కమల మొహం తెల్లగా పాలిపోయింది. ఆరోజు ఏడుస్తున్నసుశీల ముఖం గుర్తుకొచ్చింది. తనుఅవ్వాళ ఎదురుగావుండి ఆమె వస్తువు ఆమెకివ్వలేక పోయాను. కానీ ఈరోజు సుశీల ఊరుకాని ఊరైన తనకు. పంపించింది. ఎంతమంచిమనసు. కమలమనసు తన సంస్కారాన్ని తలచుకుని సిగ్గుతో, పచ్చాత్తాపంతో కుమిలిపోయింది. 'ఆగొప్పమనసు అందరికీ ఉండదు శేఖర్‌గారూ. అది ఇతరుల వస్తువు అని తెలిసి కూడా కొందరు ఇవ్వడానికి ఒప్పుకోరు. ఇతరుల బాధను అర్థం చేసుకునే సంస్కారం అందరికీ వుండదు. మీభార్యకు మేమెంతో రుణపడిఉన్నామని చెప్పండి" అన్నాడు భార్యముఖంలోకి తీక్షణంగా చూస్తూరవి. అతనికి ఆరోజు ఆగొలుసు కోసం ఎవరూ వెతుక్కోలేదన్న భార్యమాటలు చెవుల్లో గింగురు మంటోంది. శేఖర్ అడ్రస్ అడిగి తీసుకున్నాడు. భర్త చూపుల్లోని తీవ్రతను తట్టుకోలేక తల వంచుకుంది కమల.

నాలుగురోజుల తర్వాత తనపేరిట వచ్చిన పార్సిల్ చూసి 'ఎవరు పంపించారో' అనుకుంటూ సంతకం చేసి తీసుకుంది సుశీల.పార్సిల్‌విప్పిన సుశీల ఆశ్చర్యానికి అంతులేదు. అందులో తను పోగొట్టుకున్న గొలుసువుంది.